సంక్షోభంలో సాగుదారు

- రబీ ధాన్యం సొమ్ము పూర్తిగా జమ చేయని కూటమి ప్రభుత్వం
- గత ఖరీఫ్‌లో ఎర్రకాలువ వరద, తుఫాన్‌తో తీవ్ర నష్టం
- రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేటికీ జమకాని ఇన్‌పుట్ సబ్సిడీ
- రుణాల భారంతోనే ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



డి.ముప్పవరం వద్ద ఖరీఫ్ సాగుకు ఆకుమడి సిద్ధం చేస్తున్న రైతులు

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఏడాదిలోనే వ్యవసాయ రంగాన్ని, రైతులను సంక్షోభంలోకి నెట్టేసింది. రైతుల సంక్షేమానికి, పెట్టుబడి సాయానికి తిలోదకాలిచ్చేసింది. ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడింది. ఎన్నికల ముందు చంద్రబాబు అన్నదాతలకు వరాల జల్లు కురిపించారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా దాటవేస్తూ వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చి సరిపెట్టుకుంది. ఆ తరువాత అదిగో.. ఇదిగో అంటూ పెట్టుబడి సాయం ఊసే లేదు. గత ఖరీఫ్, రబీ సాగులో తీవ్రంగా నష్టపోయిన రైతులు, కౌలుదారులు అప్పుల భారంతోనే మళ్లీ ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. రబీ ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో నిడదవోలు మండలం సమిశ్రగూడెం, డి.ముప్పవరం, పెరవలి మండలం కానూరు, పెరవలిలో రైతులు రోడ్డెక్కి ధర్నాలు నిర్వహించారు. ఉండ్రాజవరం మండలం వడ్లూరు, పసలపూడి రైతు సేవా కేంద్రాల వద్ద, ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేసి అధికారుల వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. సత్యవాడలో రేషన్ డిపో ప్రారంభానికి వచ్చిన మంత్రి కందుల దుర్గేష్, జిల్లా పౌర సరఫరాల శాఖ, వ్యవసాయాధికారులను రైతులు నిలదీశారు. విత్తనాలు, ఎరువులు కోసం అవస్థలు తప్పడం లేదు.

పంట నష్ట పరిహారం ప్రకటనలకే పరిమితం

నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 58,035 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. నిడదవోలు మండలంలోని రావిమెట్ల, కంసాలిపాలెం, సింగవరం, తాళ్లపాలెం, తాడిమళ్ల, తిమ్మరాజుపాలెం, ఉండ్రాజవరం మండలం కాల్ధారి, పసలపూడి, సూర్యారావుపాలెంలో జూలై, ఆగస్టు నెలల్లో వచ్చిన ఎర్రకాలువ వరదతో 6,132 ఎకరాల్లోని వరి పైరు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. గోదావరి వరదలతో పెరవలి మండలం ముక్కామల, కాకరపర్రు, ఉసులుమర్రు, తీపర్రు, ఖండవల్లి గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అధికారుల బృందం పరిశీలించి వెంటనే పంట నష్టపరిహారం అందిస్తామని రైతులకు గొప్పగా హామీలిచ్చారు. అయితే నేటికీ రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ కాలేదు. నీట మునిగిన పొలాల్లో మళ్లీ నాట్లు వేసి సాగు చేయగా ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రైతులు మళ్లీ నష్టపోయారు.

నిడదవోలు నియోజకవర్గంలో పంటల సాగు విస్తీర్ణం

మండలం	ఎకరాలు
నిడదవోలు	22,470
పెరవలి	16,765
ఉండ్రాజవరం	18,800
మొత్తం	58,035

అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూపులు

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హులైన నిడదవోలు నియోజకవర్గంలోని 21,334 మంది రైతులకు పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. ఒక్కో రైతుకు రూ.6 వేల వరకు కేంద్రం నుంచి పీఎం కిసాన్ నిధి నుంచి జమ కావాల్సి ఉంది. తాము అధికారంలోకి వస్తే ఏటా అన్నదాత సుఖీభవం పథకంలో భాగంగా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. గతేడాది ఈ పథకానికి మంగళం పలికారు. ఈ ఏడాది జూన్‌లో ఇస్తామని చెబుతున్నా ఇంతవరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టలేదు.

నాడు రైతులకు అండగా జగన్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం సీజన్ ముందే అందించేవారు. కరోనా లాంటి సంక్షోభం సమయంలోనూ ఏటా క్రమం తప్పకుండా జూన్ నెలలో రూ.7,500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేలు రైతుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ అయ్యేది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలురైతులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగుచేస్తున్న కౌలుదారులకు అప్పటి ప్రభుత్వం ఏటా రూ.13,500 చొప్పున అందజేసింది. నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన 21,334 మంది రైతులకు రూ.115.20 కోట్లు రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించారు.



డి.ముప్పవరంలో ధాన్యం సొమ్ము కోసం నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు (ఫైల్)



రావిమెట్లలో ఎర్రకాలువ ఉధృతికి ముంపునకు గురైన పంట పొలాలు (ఫైల్)

ఆనాటి భరోసా లేదు



గత ప్రభుత్వంలో రైతులకు ఎంతో మేలు జరిగింది. సకాలంలో రైతు భరోసా అందింది. ఈ కూటమి ప్రభుత్వంలో ఆనాటి భరోసా లేదు. రైతు సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు సాయం చేస్తామని హామీ ఇచ్చి ఏడాదైనా అతిగతీ లేదు. రబీలో ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో బాధిత రైతులందరూ ఆవేదనతో రోడ్డెక్కాం. ఎర్రకాలువ వరదతో నష్టపోయిన రైతులకు ఇప్పటికీ బ్యాంక్ ఖాతాల్లో పరిహారం జమ చేయలేదు.

– కొత్తపల్లి సత్యనారాయణ, రైతు, సమిశ్రగూడెం

నిడదవోలు మండలంలో రబీకి సంబంధించి ఇంకా 8,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఈనెల 4న 3,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు వచ్చాయి. మిగిలిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చారు. ఇంకా రబీలో సుమారు 605 మంది రైతులకు రూ.8.22 కోట్ల ధాన్యం సొమ్ము వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

ఘనంగా అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ



చివటంలో పుంతలో ముసలమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: చివటం గ్రామంలో పుంతలో ముసలమ్మ, కనకదుర్గమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖర ప్రతిష్ఠ, గణపతి ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ కార్యక్రమాలను బ్రహ్మశ్రీ మద్దిరాల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఈ క్రతువును నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొని, పుంతలో ముసలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ కమిటీ సభ్యులు చందాల ద్వారా నిధులు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాసరి మునిరాజు, దాసరి నాగేశ్వరరావు, ఎం.మురళీకృష్ణ, కోలా సుబ్రమణ్యం, కోలా లక్ష్మి గణపతి, గంటిన చిన్న వెంకన్న, కూనపరెడ్డి నారాయణ, చౌదరి కుమారస్వామి పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,73,022 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న సమారాధన

చాగల్లు: చాగల్లు ప్రధాన కూడలిలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారి జయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈ అన్నసమారాధనను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ఉండ్రాజవరం: సీఎం సహాయ నిధి పేదలకు ఆర్థికంగా ఉపకరిస్తుందని ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. వేలివెన్నులో ఆదివారం ఆయన చేతుల మీదుగా పెరవలి మండలం పిట్టలవేమవరానికి చెందిన గంటి సుధాకరరావుకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల రామస్వామి రెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, చెంగళరావు, చిల్లా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కంబాలచెరువు: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్ సీఐ పి.శివగణేష్ ఆధ్వర్యంలో హరిత న్యూరో హాస్పిటల్ సైకియాట్రిస్ట్ డాక్టర్ కార్తీక్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సమాజంలో ఏ విధంగా ప్రవర్తించాలి, ఏ విధంగా బతకాలో వివరించారు. మంచి అలవాట్లను ఏ విధంగా అలవర్చుకోవాలో తెలిపారు. రౌడీషీటర్లు తమకు ఉన్న సమస్యలను డాక్టర్‌కు వివరించారు. ఆయన వారికి పరిష్కార మార్గాలను తెలిపారు. సీఐ శివగణేష్ మాట్లాడుతూ చెడు అలవాట్లను దూరం చేసుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా జీవించాలన్నారు.

పేదల విద్యకు వైఎస్సార్ అధిక ప్రాధాన్యం



గజ్జరంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: దళిత విద్యార్థుల ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహించడం ద్వారా వారు మరింత ఉన్నతంగా ఎదుగుతారని కొవ్వూరు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని గజ్జరంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలు వద్ద ఆదివారం మండల వైఎస్సార్ సీపీ దళిత జేఏసీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దళిత జేఏసీ నాయకుల చేతుల మీదుగా మండలంలోని 500 పైగా మార్కులు సాధించిన 22 మంది విద్యార్థులకు శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపిక అందజేసి, రూ.1000 చొప్పున నగదు పురస్కారం అందజేసారు. ఈ కార్యక్రమంలో సమాజంలో నిస్వార్థంగా పనిచేస్తున్న మండలంలోని పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల దళిత జేఏసీ అధ్యక్షుడు యాళ్ల బాబూరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి గ్రామానికి ఒక్కరు చొప్పున ఎంపిక చేసి 22 మందికి పురస్కారాలు అందజేశామన్నారు. భవిష్యత్తులో ఇంటర్ విద్యార్థులకు కూడా పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఆయన బాటలో తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అనేక పథకాలను బడుగు బలహీన వర్గాలకు అమలు చేసారన్నారు. పదో తరగతి విద్యార్థులకు టర్నింగ్ పాయింట్ అని కష్టపడి చదివి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత జేసీ నాయకులు ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, గూడా విజయరాజు, గుంటు చిన్నబ్బాయి, గండి రాంబాబు, పిట్టా శ్రీనివాస్, నూతంగి సురేష్, బట్టు సుబ్బారావు, కొల్లి దుర్గారావు, చిక్కాల మహేష్, దాకే రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ



దూబచర్లలో విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: దూబచర్లలో నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వేదపండితులు అరిపిరాల రుద్రమూర్తి, ఫణిబాబు ఆధ్వర్యంలో సుబ్రమణ్య, ఆంజనేయ, అనంతపద్మనాభస్వాముల విగ్రహప్రతిష్ఠ జరిగింది. ఈ వేడుకలో మాజీ హోం మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తానేటి వనిత ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, మాజీ జెడ్పీటీసీ బంక అప్పారావు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి తొమ్మండు రమేష్, తొమ్మండ్రు రవి, పంది సత్యనారాయణ, చీమకుర్తి రాజసింహ, సినీ నటుడు ముల్లేటి బాలాజీ, ఉప సర్పంచ్ కాసాని బాటయ్య, దోవసాయి తదితరులు పాల్గొన్నారు. చీపురుగూడెంలో ఇటీవల చెల్లు సుబ్రమణ్యం కుమారుడు ప్రసాద్ మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం వారి కుటుంబ సభ్యులను వనిత పరామర్శించారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



పాటెమ్మ తల్లి



ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

చాగల్లు: ఊనగట్ల శివారు అమ్మిగుంటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పాటెమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, ఆరాధనలు, క్షీరాధివాసం, నీరాజన మంత్ర పుష్పములు, మండప పునఃపూజలు, గర్భిన్యాసం, నవరత్నములు, ఆకర్షణ, మంత్ర స్థాపన, చతుర్వేద స్వస్తి పూజలు వేద పండితుల సమక్షంలో చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు. ప్రథమ కుంకుమ పూజ, పూర్ణాహుతి, భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా సోమాలమ్మ తల్లి జాతర

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు మండలం నందమూరులో సోమాలమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. జాతర ముగింపు సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తలారి వెంకట్రావు, మాజీ హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మారిన రామకృష్ణ ఇంటి వద్ద నిర్వహించిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంఠమణి రమేష్‌బాబు, తోట రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు, రుత్తల భాస్కరరావు తదితరులున్నారు.

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో ఎలైట్ విద్యార్థుల ప్రతిభ



ఇమ్మణ్ణి లహరిశ్రీ



బుడుపుల ఆశాశ్రీ

నల్లజర్ల: ఏపీ ఈఏపీ సెట్‌లో ఫలితాల్లో దూబచర్ల ఎలైట్ కళాశాల విద్యార్థులు 2025 అత్యుత్తమ ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి ఆదివారం తెలిపారు. ఇమ్మణ్ణి లహరిశ్రీ రాష్ట్రస్థాయిలో 2,507 ర్యాంకు, బొర్రా రత్నలాలస 9999 ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఇంటర్ విభాగంలో బుడుపుల ఆశాశ్రీ 989 మార్కులు సాధించగా, సీనియర్ సీఎస్ఈ విభాగంలో 984 మార్కులు డి.శ్రావణి సాధించినట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే ప్రతిభా అవార్డులకు వారు ఎంపికయ్యారని నగదు పురస్కారాన్ని కలెక్టరు చేతుల మీదుగా సోమవారం అందుకోనున్నారని చెప్పారు.ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ఎలైట్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డి.ప్రభాకరరావు, డైరక్టర్స్ సుదర్శనం, జి.సుబ్బారావు అధ్యాపకులు అభినందించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న పోలీస్ బృందాలు

రాజమహేంద్రవరం సిటీ: మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు రాజమహేంద్రవరం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పలు విభాగాలలో ఆర్పీఎఫ్, జీఆర్పీ, టూటౌన్ పోలీస్ అధికారులు, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్‌తో మాదక ద్రవ్యాలపై సంయుక్తంగా విస్తత తనిఖీలు నిర్వహించామన్నారు. సుమారు 50 మంది అధికారులు, సిబ్బంది రైల్వే స్టేషన్‌లోని పాట్‌ఫామ్స్, వెయిటింగ్ హాళ్లు, పార్శిల్ కార్యాలయం, క్లాక్ రూమ్‌లలో తనిఖీలు నిర్వహించారు.

దివీస్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి

తగరపువలస: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న దువ్వారపు సత్యప్రకాష్ (31) అనే దివీస్ ఉద్యోగి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా, ఉండ్రాజవరం మండలం, రజకులపేటకు చెందిన సత్యప్రకాష్ చిప్పాడలోని దివీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు మూడేళ్ల క్రితం లక్ష్మీదుర్గతో వివాహమైంది. బాలాజీనగర్‌లో కుటుంబంతో కలసి అద్దె ఇంట్లో ఉంటున్న సత్యప్రకాష్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. శనివారం ఇంట్లో ఉన్న సమయంలోనే స్పృహ కోల్పోయి పడి ఉండటాన్ని అతని భార్య గమనించింది. నోటి వెంట నురగలు కూడా రావడంతో, ఆటోలో భర్తను సంగివలసలోని అనిల్ నీరుకొండ జనరల్ ఆసుపత్రికి తరలించింది. అక్కడ పరీక్షించిన వైద్యులు సత్యప్రకాష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. లక్ష్మీదుర్గ ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదవులకు రాజీనామా చేయాలి

పార్టీ మారిన వారి ఆరోపణలను ఖండించిన వైఎస్సార్ సీపీ నేతలు



కొవ్వూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు, నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): పార్టీకి రాజీనామా చేయడం కాదు, పార్టీ ద్వారా పొందిన పదవులకు రాజీనామా చేస్తే బాగుంటుందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. వైఎస్సార్ సీపీలో పదవులు పొంది ఇప్పుడు బీసీలకు అన్యాయం జరిగిందంటూ లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, పలువురు కౌన్సిలర్లు, నాయకులు విమర్శించారు. కొవ్వూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఇటీవల కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, 15వ వార్డు కౌన్సిలర్ అక్షయ పాత్ర శ్రీవాస్, 10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు, 3వ వార్డు కౌన్సిలర్ వారిగేటి లలిత కుమారి వైఎస్సార్ సీపీకి రాజీనామా చేయడంతో పాటు పార్టీపై పలు ఆరోపణలు చేయడాన్ని కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు వారి తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంధ్రోతు అంజలి, 22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు, 12వ వార్డు కౌన్సిలర్ అంకోలు లిల్లి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి తదితరులు మాట్లాడుతూ రాజీనామాలు చేయడం వారి వ్యక్తిగతమని అయితే వారు టీడీపీ కార్యాలయానికి వెళ్లి రాజీనామా చేయడం సిగ్గుచేటని అన్నారు. వైఎస్సార్ సీపీలో పదవులు పొంది పార్టీపై బురద చల్లడం సరికాదన్నారు. బీసీలకు పార్టీలో ఎప్పుడూ ప్రాధాన్యం ఉందని నియోజకవర్గ సమీకరణలో భాగంగా పదువులు కేటాయిస్తారని అన్నారు. వైఎస్సార్ సీపీలో ముగ్గురు బీసీలకు పట్టణ అధ్యక్షులుగా అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీలో మహిళలకు కూడా అనేక పదువులు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యసవరపు శ్రీనివాస్, ఎన్. శ్రీనివాస్, జి. సుకాంత్ తదితరులన్నారు.

మోటారు రాగి తీగల చోరీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం, రఘుదేవపురం లంకభూముల్లోని విద్యుత్ మోటార్లకు సంబంధించిన వైర్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. శుక్రవారం సీతానగరానికి చెందిన రైతులు మట్ట శ్రీను, ఈలి శ్రీధర్, ఉప్పులూరి రమణ, చిటికిరెడ్డి కాపు, చిటికిరెడ్డి పోశయ్య, మట్ట మణి, మట్ట పోశయ్య, సంగిశెట్టి కోటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ శనివారం రాత్రి రైతులకు చెందిన సుమారు 30 మోటార్లకు చెందిన రాగి వైరును కట్ చేసి దొంగిలించారని చెప్పారు. మోటారు స్టార్టర్ నుంచి మోటారు వరకు రాగి వైరు సుమారు 15 మీటర్లు ఉంటుందని, ఆ వైరును కత్తిరించి తీసుకుపోయారన్నారు. మోటారు నుంచి స్టార్టర్ వరకు వైరు రూ.8 వేల నుంచి రూ.10 వేలు వరకు ఖరీదు ఉంటుందన్నారు. అయితే రాత్రి సమయంలో కొంతమంది యువకులు లంక భూముల్లో మద్యం సేవించి తిరుగుతున్నారని, వారే దీనికి పాల్పడి ఉండవచ్చని అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.